ఎర్రవల్లిలోని తన నివాసానికి వచ్చిన చింతమడక గ్రామస్థులకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి తదితరులు

పోటెత్తిన అభిమానం

- బస్సుల్లో వచ్చిన చింతమడక గ్రామస్థులు
- అభినేతను చూస్తూ భావోద్వేగం
- మార్మోగిన 'జై కేసీఆర్' నినాదాలు
- ఎర్రవల్లికి బారులు తీరుతున్న అభిమానులు

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): కేసీఆర్.. ఆ పేరు వింటేనే ఓ ఉద్వేగం. ప్రత్యక్షంగా చూస్తే ఓ భావోద్వేగం. అది ఉద్యమమైనా, బహిరంగ సభ అయినా, ఆఖరికి టీవీలో ఆ స్వరం వింటే ఆత్మవిశ్వాసం. ఆయన మాటే కొండంత భరోసా. ఇంకా చెప్పాలంటే, కేసీఆర్.. అంటే ఒక ఎమోషన్. అది ఉద్యమమైనా, పరిపాలనైనా! ప్రపంచవ్యాప్తంగా తెలంగాణకు ఇమేజ్ తెచ్చింది ఈ మూడు అక్షరాలే. ఉద్యమాన్ని ఉరకలెత్తించినా, అభివృద్ధిని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లినా జననేతకే సాధ్యమయ్యింది. అందుకే ఆయనపై తరగని ప్రేమాభిమానాలు జనం గుండెల్లో ఎల్లకాలం ఉంటాయని రుజువు చేసే దృశ్యాలు సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలోని ఎర్రవల్లిలో రోజూ ఆవిష్కృతమవుతున్నాయి. ప్రజా శ్రేయస్సే శ్వాసగా పాలన సాగించిన పాలనాదక్షుడు కేసీఆర్.. అధికారంలో లేకపోవటాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. గుండె లయ తప్పుతున్నంత ఆందోళన కేసీఆర్ సొంతూరు చింతమడకవాసుల్లో కనిపించింది. అందుకే ఊరంతా దండులాగా బుధవారం ఎర్రవల్లికి పోటెత్తారు. సెక్యూరిటీ కారణాల దృష్ట్యా ఒక్కసారిగా వందల మందిని వ్యవసాయ క్షేత్రంలోకి పంపించటం సాధ్యంకాదని పోలీసులు చెప్పినా వినకుండా ససేమిరా అన్నారు. ప్రజలు పట్టుబట్టడంతో గేటు తెరవక తప్పలేదు పోలీసులకు. చింతమడక నుంచి ప్రత్యేక బస్సుల్లో వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. బస్సు దిగగానే పెద్దఎత్తున 'జై కేసీఆర్' అంటూ నినాదాలు చేస్తూ ఉత్సాహంగా ముందుకురికిన దృశ్యాలు కనిపించాయి. కేసీఆర్‌ను చూడగానే దండాలయ్యా.. నువ్వే ఉండాలయ్యా... అంటూ గుండెల్లో గూడు కట్టుకున్న అభిమానాన్ని చాటుకున్నారు. తన కోసం తరలివచ్చిన ప్రజలకు అధినేత కేసీఆర్ అభివాదం చేశారు. తన గ్రామస్థులను ఆప్యాయంగా పలుకరించారు. మూడు రోజులుగా ఎర్రవల్లిలో ఉన్న నివాసానికి పార్టీ నేతలు, ప్రజలు, వివిధ రంగాల ప్రముఖులు చేరుకుంటున్నారు. జననేతను కలిసి భావోద్వేగానికి గురవుతున్నారు.

నేడు సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణం

- ప్రమాణ స్వీకారం చేయనున్న మంత్రులు
- మధ్యాహ్నం 1.04 గం.కు ముహూర్తం
- ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లు.. సీఎస్ సమీక్ష
- హాజరుకానున్న కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, ఖర్గే, రాహుల్, ప్రియాంక
- ప్రత్యేకంగా కలిసి ఆహ్వానించిన రేవంత్
- పలువురు సీఎంలకు, నేతలకు ఆహ్వానాలు
- ప్రజలందరినీ ఆహ్వానిస్తూ బహిరంగ లేఖ

ఎల్బీ స్టేడియంలో సీఎం ప్రమాణ స్వీకార ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గురువారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనున్నది. నూతన ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మధ్యాహ్నం 1.04 గంటలకు ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో రేవంత్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ వారితో ప్రమాణం చేయించనున్నారు. కాంగ్రెస్ నేతలు గవర్నర్‌ను కలిసి సీఎల్పీ నేతగా రేవంత్‌రెడ్డిని ఎన్నుకున్నట్టు 64 మంది ఎమ్మెల్యేల సంతకాలతో కూడిన లేఖను అందజేశారు. గురువారం మధ్యాహ్నం ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారోత్సవం ఉంటుందని గవర్నర్‌కు తెలియజేశారు.

తరలిరానున్న కీలక నేతలు

ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి దేశంలోని పలువురు కీలక రాజకీయ నేతలు తరలిరానున్నారు. ఇప్పటికే వారందరికీ రేవంత్‌రెడ్డి నుంచి, పీసీసీ నుంచి ప్రత్యేకంగా ఆహ్వానాలను పంపించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఏఐసీసీ నేతలు కూడా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అధిష్ఠానం పిలుపు మేరకు మంగళవారం రాత్రి ఢిల్లీ వెళ్లిన రేవంత్‌రెడ్డి బుధవారం ఉదయం ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీని కలిసి తనను సీఎల్పీ నేతగా ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. తన ప్రమాణ స్వీకారానికి రావాల్సిందిగా వారిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. వీరితోపాటు పలువురు జాతీయ, ఆయా రాష్ట్రాల కీలక నేతలకు ఆహ్వానం పంపించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఏపీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, బీహార్ సీఎం నితీశ్‌కుమార్, తమిళనాడు సీఎం స్టాలిన్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌తోపాటు అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులకు ఆహ్వానం అందించారు. ఏఐసీసీ నుంచి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, కేసీ వేణుగోపాల్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తోపాటు మరికొందరు కీలక నేతలు రానున్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి రావాల్సిందిగా అమరవీరుల కుటుంబాలకు ఆహ్వానం పంపించిన రేవంత్‌రెడ్డి.. ప్రజలను కూడా రావాల్సిందిగా కోరారు.

దివ్యాంగురాలు రజనీకి తొలి ఉద్యోగం

ఎల్బీ స్టేడియంలో సీఎంగా ప్రమాణ స్వీకారం అనంతరం దివ్యాంగురాలైన రజనీకి తొలి ఉద్యోగం కల్పిస్తూ ఫైలుపై రేవంత్‌రెడ్డి తొలి సంతకం చేయనున్నారు. ప్రమాణ స్వీకారోత్సవానికి రావాల్సిందిగా రజనీకి ఆహ్వానం అందించారు. అక్టోబర్ 17న గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డిని కలిసిన రజనీ తన ఇబ్బందులను తెలియజేశారు. దివ్యాంగురాలైన తనకు ఎక్కడా ఉద్యోగం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆమెకు గ్యారంటీ కార్డు అందించిన రేవంత్‌రెడ్డి.. తమ ప్రభుత్వం రాగానే తొలి ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే గురువారం ఆమెకు ఉద్యోగం ఇవ్వనున్నారు.

ఏర్పాట్లపై సీఎస్ సమీక్ష

ప్రమాణ స్వీకార ఏర్పాట్లపై డీజీపీ రవిగుప్తా తదితర అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించిన సీఎస్ శాంతికుమారి.. అనంతరం ఎల్బీ స్టేడియానికి వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. స్టేడియం చుట్టుపక్కల ప్రాంతాలతోపాటు నగరంలో కాంగ్రెస్ నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు. ఎల్బీ స్టేడియంలో ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ఆ ప్రాంతంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలను విధించారు. వాహనదారులు అటువైపు రావొద్దని సూచించారు.

లోకం పోకడ

మేము కేసీఆర్ వెంటే...

బీఆర్ఎస్ ఎన్నారై నాయకులు

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): 'ఉద్యమ సమయం నుంచి మీ వెంటే ఉన్నాం.. ఎలాంటి పరిస్థితుల్లోనైనా మీ వెంటే ఉంటూ మీ నాయకత్వంలో ముందుకు వెళ్తాం'.. అని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌తో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం తెలిపారు. తెలంగాణ ఎన్నికల ఫలితాల తర్వాత వివిధ దేశాల్లో ఉన్న బీఆర్ఎస్ ఎన్నారై నాయకులు ఎర్రవల్లిలోని నివాసంలో పార్టీ అధ్యక్షుడు కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నారైగా పార్టీకి సేవలందించిన తనకు కేసీఆర్.. రాష్ట్ర కార్పొరేషన్ పదవి ఇచ్చి గౌరవించారని అనిల్ ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి పార్టీ పిలుపునిచ్చే అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటామని యూకే అధ్యక్షుడు అశోక్ గౌడ్ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ దేశాలకు చెందిన బీఆర్ఎస్ ఎన్నారై ప్రతినిధులు పాల్గొన్నారు.

బీసీ నేతకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలి

బీసీ సంక్షేమ సంఘం, కుల నిర్మూలన వేదిక

హైదరాబాద్, డిసెంబర్6 (నమస్తే తెలంగాణ): బీసీ నేతకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, కుల నిర్మూలన వేదిక అధ్యక్షుడు పావని నాగరాజు బుధవారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. జనాభాలో 60 శాతంగా ఉన్న బీసీలకు కాంగ్రెస్ పాలకవర్గంలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఇతర వర్గాలకు అవకాశాలు కల్పిస్తూ, బీసీలకు ఇవ్వకపోవడం ద్రోహమే అవుతుందని పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డి ఇప్పటికీ టీడీపీ నేతే

ఏపీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

హైదరాబాద్, డిసెంబర్6 (నమస్తే తెలంగాణ): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇప్పటికీ టీడీపీ నేతే అని ఏపీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆరోపించారు. ఏపీలోని అమరావతిలో బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ఎన్నికల్లో కేసీఆర్, కేటీఆర్ లక్ష్యంగా రాజకీయం జరిగిందని తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకొని కుతంత్రాలతో బీఆర్ఎస్ పార్టీని ఓడించారని చెప్పారు. ఇదంతా ఎల్లో మీడియా, చంద్రబాబు ప్లాన్ అని విమర్శించారు.

ఎన్జీఆర్ఐ సైంటిస్టుకు ఐజీయూ తల్వానీ అవార్డు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : నేషనల్ జియోఫిజికల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎన్జీఆర్ఐ) సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ లబానీ రే.. 'ఐజీయూ -అనీ తల్వానీ' స్మారక పురస్కారం అందుకొన్నారు. భూ అంతర్నిర్మాణం, జియోథర్మల్ మాడలింగ్ రంగంలో ఆమె చేసిన పరిశోధనలకు ఈ అవార్డు వరించింది. ఇండియన్ స్కూల్ ఆఫ్ మైన్స్ అండ్ ఆప్లయిడ్ జియోఫిజిక్స్‌లో ఆమె ఎమ్మెస్సీ పూర్తిచేశారు. ఉస్మానియా వర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. అనంతరం ఎన్జీఆర్ఐలో సీనియర్ సైంటిస్టుగా పలు పరిశోధనలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతల వద్ద శిలల ఉష్ణ వాహకతను కొలవడానికి ఆమె ఎన్జీఆర్ఐలో ప్రత్యేక ల్యాబోరేటరీని ఏర్పాటు చేశారు. వెస్టన్ హిమాలయాల్లో జలవిద్యుత్తు ప్రాజెక్టులలో ఇంజినీరింగ్ వ్యూహాల అభివృద్ధికి నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు అవసరమైన సాంకేతిక, పరిశోధన సమాచారం అందించారు. అణు వ్యర్థ నిక్షేప స్థలాల అభివృద్ధికి బాబా అటామిక్ రిసెర్చ్ సెంటర్‌తో కలిసి పరిశోధన చేశారు. ఓఎన్జీసీ-ఏఈజీ ఉత్తమ పీహెచ్‌డీ థీసెస్ పురస్కారం, బాయ్‌స్కాస్ట్ ఫెలోషిప్‌ను కూడా డాక్టర్ లబానీ అందుకొన్నారు.

టీఎస్ఐఐసీ చైర్మన్ రాజీనామా

హైదరాబాద్, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ) : టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు తన పదవికి రాజీనామా చేశారు. బుధవారం తన రాజీనామా లేఖను సీఎస్ శాంతికుమారికి పంపారు. తన పదవీకాలంలో సహకారం అందించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు ఆయన లేఖలో పేర్కొన్నారు. టీఎస్ఐఐసీ ఇకముందు మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
మెదక్	18.7°c	26.6°c
ఆదిలాబాద్	19.2°c	28.5°c
నిజామాబాద్	19.3°c	24.6 °c
నల్లగొండ	19.4°c	28.4°c
రంగారెడ్డి	19.4°c	29.1°c
కరీంనగర్	20.0°c	23.0°c
హైదరాబాద్	20.2°c	26.5°c
ఖమ్మం	21.0°c	30.0°c
వరంగల్	21.0°c	24.0°c
మహబూబ్‌నగర్	22.7°c	27.1°c

నల్లగొండ ఉద్ధండులకు అందని 'సీఎం'

- గెలిపిస్తే సీఎం అవుతానని ఎన్నికల్లో ఎవరికి వారే ప్రచారం
- ముఖ్యమంత్రి రేసులో చతికిలపడ్డ ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ ప్రతినిధి, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లాకు ముఖ్యమంత్రి పదవి మరోసారి అందని ద్రాక్షగానే మిగిలిపోయింది. ప్రతి ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి ఇతర జిల్లాలతో పోలిస్తే నల్లగొండ జిల్లా అత్యధిక స్థానాలు కట్టబెడుతున్నది. ఈసారి కూడా మొత్తం 12 స్థానాలకు 11 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధించారు. తమను గెలిపిస్తే సీఎం అవుతామని సీనియర్ నేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం చేసుకున్నారు. వీరికి జానారెడ్డి కూడా తోడయ్యారు. వీరికి చివరకు నిరాశే మిగిలింది. జిల్లాకు చెందిన కే జానారెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో కీలక నేతలుగా గుర్తింపు పొందారు. ప్రస్తుత ఎన్నికల్లో జానారెడ్డి పోటీచేయలేదు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఆరోసారి, వెంకట్‌రెడ్డి ఐదోసారి గెలుపొందారు. ఈసారి గెలిపిస్తే తమకు సీఎం అయ్యే చాన్స్ ఉన్నదని ఎన్నికల ప్రచారంలో వీరిద్దరూ అనేకసార్లు చెప్పుకున్నారు. దీంతో క్యాడర్ కూడా మరింత ఉత్సాహంతో పనిచేసింది. జానారెడ్డి కూడా ఒక సందర్భంలో తనకు కూడా సీఎం అయ్యే అవకాశం లేకపోలేదని చెప్పారు. పదవులు తననే వెతుక్కుంటూ వస్తాయని, అలాంటి సందర్భమే వస్తే నాగార్జునసాగర్ నుంచి బరిలో ఉన్న తన కుమారుడు జయవీర్‌రెడ్డి రాజీనామా చేస్తారని, తాను పోటీ చేసి సీఎం అవుతాంటూ కలల దృశ్యాన్ని ఆవిష్కరించారు. వీరితోపాటు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా తనను గెలిపిస్తే కీలక స్థానంలో ఉంటానని ప్రచారం చేసుకున్నారు. కానీ వీరెవ్వరూ సీఎం రేసులో నిలబడలేకపోయారు.

చివరి వరకూ ఉత్తమ్ ప్రయత్నం

ముఖ్యమంత్రి పదవి కోసం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చివరి వరకు ప్రయత్నాలు కొనసాగించారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా, మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన తనకు సీఎం అయ్యేందుకు అన్ని అర్హతలు ఉన్నాయంటూ అధిష్ఠానం వద్ద వాదించారు. తనతో పోలిస్తే రేవంత్‌రెడ్డికి పాలనాపరమైన అనుభవం లేదని, తొందరపాటు వ్యాఖ్యలతో నష్టం జరుగుతుందని వివరించారు. మల్లు భట్టి విక్రమార్కతో కలిసి చివరి వరకు ప్రయత్నం చేసినా అధిష్ఠానం రేవంత్‌రెడ్డి వైపే మొగ్గుచూపింది.

చేతులెత్తేసిన కోమటిరెడ్డి

కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా సోనియాగాంధీ ఆశీస్సులతో ఎప్పుడో ఓ సారి తాను కూడా సీఎం అవుతానని చాలాసార్లు చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి బూర్గుల రామకృష్ణారావు, రంగారెడ్డి జిల్లా నుంచి మర్రి చెన్నారెడ్డి, ఖమ్మం నుంచి జలగం వెంగళరావుకు సీఎం అయ్యే చాన్స్ దక్కిందని ఈసారి నల్లగొండ నుంచి సీఎం కావడం ఖాయమని చెప్పుకున్నారు. కానీ, ఫలితాల అనంతరం కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రేస్‌లో లేకుండాపోయారు. రేవంత్‌రెడ్డి పార్టీ కోసం కష్టపడ్డాడని, ఆయనే సీఎం పదవికి అర్హుడని వ్యాఖ్యానించడంతో కోమటిరెడ్డి చేతులెత్తేసినట్టయ్యింది. ఇక జానారెడ్డి గురించి ప్రస్తావించిన వారే లేకుండా పోయారు. దీంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సీఎం పోస్టు మరోసారి కలగానే మిగిలింది.

ఈ ఫలితం స్పీడ్‌బ్రేకరే

- రాజకీయాల్లో ఇవన్నీ సహజమే
- ప్రతిపక్ష పాత్రలో సైతం రాణిస్తాం
- సమస్యలపై ప్రజల గొంతుక అవుతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఎన్నికల్లో ఇలాంటి ఫలితాలు సహజమేనని, ఇది తాత్కాలిక స్పీడ్‌బ్రేకర్ మాత్రమేనని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసేలా ప్రజా గొంతుకై ఒత్తిడి తీసుకొస్తామని తెలిపారు. ప్రజా తీర్పును గౌరవిస్తున్నామని, ప్రతిపక్షపాత్రలో రాణిస్తామని పేర్కొన్నారు. ఐదోసారి ఎమ్మెల్యేగా గెలిచి బుధవారం మొదటిసారి సిరిసిల్లకు వచ్చిన ఆయనకు తెలంగాణ భవన్ వద్ద కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు తమకు ఇచ్చిన కొత్త పాత్రలో క్రియాశీలకంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు.

పేరు మారినా పోరాటం కొత్తకాదు

పార్టీ పేరు టీఆర్ఎస్ నుంచి బీఆర్ఎస్‌గా మారినా పోరాటం తమకు కొత్తకాదని కేటీఆర్ పేర్కొన్నారు. కేసీఆర్ సీఎంగా లేరా? ప్రభుత్వం పోయిందా? అంటూ కాంగ్రెస్‌కు ఓటేసిన వాళ్లు సైతం ఆవేదనతో తమకు మేసేజ్‌లు, వీడియోలు పెడుతున్నట్టు తెలిపారు. ఎవరు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా, అభివృద్ధి, సంక్షేమానికి ఓటేసి గెలిపించిన సిరిసిల్ల ప్రజలకు శిరస్సు వంచి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకొంటున్నట్టు తెలిపారు. 39మంది ఎమ్మెల్యేలను గెలిపించిన ప్రజల విశ్వాస్వాన్ని తాము నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు. దురదృష్టవశాత్తు వేములవాడలో స్వల్ప మెజార్టీతో ఓ సీటును కోల్పోయామని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నా, పాలక పక్షంలో ఉన్నా ప్రజల కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సిరిసిల్ల అభివృద్ధికి అధికార పార్టీపై ఒత్తిడి తెస్తానని చెప్పారు.

దేవయ్య కుటుంబానికి రామన్న పరామర్శ

గంభీరావుపేట, డిసెంబర్ 6: బీఆర్ఎస్ ఓటమిని జీర్ణించుకోలేక మంగళవారం గుండెపోటుతో మరణించిన రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన ఆవునూరి దేవయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే కేటీఆర్ బుధవారం పరామర్శించారు. పార్టీ కోసం చురుగ్గా పనిచేసిన దేవయ్య అకాల మరణం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ హామీ ఇచ్చారు.

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఆర్ఎస్‌సీలో..

హైదరాబాద్‌లోని ఇస్రో పరిధిలోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సీ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 43
- పోస్టులు: టెక్నీషియన్
- విభాగాలు: ఎలక్ట్రికల్, డీటీపీ, ఫొటోగ్రఫీ
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 31
- వెబ్‌సైట్: https://www.nrsc.gov.in

బీబీనగర్ ఎయిమ్స్‌లో...

బీబీనగర్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 191
- పోస్టులు: సీనియర్ రెసిడెంట్స్, జూనియర్ రెసిడెంట్స్
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: డిసెంబర్ 19
- వెబ్‌సైట్: http://www.aiimsbibinagar.edu.in

ఎన్‌హెచ్ఏఐలో..

నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 18
- పోస్టులు: అడ్వైజర్ (ప్లాంటేషన్), జాయింట్ అడ్వైజర్ (ఎన్విరాన్‌మెంట్ అండ్ ప్లాంటేషన్)
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: జనవరి 4
- వెబ్‌సైట్: www.nhai.gov.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- కరెంట్ అఫైర్స్, చరిత్ర, ఇండియన్ జాగ్రఫీ కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

సీఎం.. సగం సగం?

మొదటిపేజీ తరువాయి...

తెలుస్తున్నది. కర్ణాటక తరహాలోనే ఇక్కడ కూడా సీఎం పీఠం పంపకాలు జరగాలని పట్టుబడుతున్నట్టు సమాచారం. పీసీసీ మాజీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు మరో ఇద్దరు సీనియర్ నేతలు సీఎం పదవిపై సగం-సగం ఫార్ములాను అధిష్ఠానం ముందు ఉంచినట్టు తెలిసింది. సీఎం పదవీ కాలం మొత్తం రేవంత్ ఒక్కరికే ఇవ్వకుండా రెండున్నరేండ్లు రేవంత్‌రెడ్డికి, మిగిలిన కాలం సీనియర్లలో ఒకరికి ఇవ్వాలని వారు డిమాండ్ చేసినట్టు సమాచారం! తొలుత కొన్ని ఇబ్బందులు ఎదురైనా, ఆ తర్వాత సాఫీగా సాగిపోతుందనుకున్న తరుణంలో సీనియర్లు ఈ ప్రతిపాదన తెరపైకి తీసుకొచ్చేసరికి అధిష్ఠానంలో ఆందోళన మొదలైనట్టు తెలిసింది. ఈ విషయాన్ని అధిష్ఠానం పెద్దలతోపాటు రేవంత్‌రెడ్డి అత్యంత గోప్యంగా ఉంచుతున్నట్టు సమాచారం.

మంత్రివర్గంపైనా మల్లగుల్లాలు

తెలంగాణ మంత్రివర్గ కూర్పుపైనా కాంగ్రెస్ అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతున్నట్టు సమాచారం. మంత్రి పదవుల కోసం నేతల మధ్య తీవ్ర పోటీ నెలకోవడంతో ఎవరికి ఇవ్వాలన్నది తేల్చులేకపోతున్నట్టు తెలుస్తున్నది. పలువురు ఆశావహులు ఢిల్లీకి క్యూ కట్టారు. తమకు తెలిసిన వారితో అధిష్ఠానం వద్ద ప్రయత్నాలు చేస్తున్నారు. కచ్చితంగా మంత్రివర్గంలో చోటు కల్పించాలని వారు పట్టుబడుతున్నట్టు సమాచారం. అధిష్ఠానం నుంచి మాత్రం ఎలాంటి క్లారిటీ రాలేదని తెలిసింది. గురువారం సీఎంతో పాటు మంత్రులు కూడా ప్రమాణ స్వీకారం చేస్తారని ఆ పార్టీ నేతలు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి వరకు మంత్రివర్గంలో ఎవరికి చోటు దక్కిందనే అంశంపై స్పష్టత రాకపోవటం గమనార్హం. ఈ నేపథ్యంలో గురువారం సీఎం ఒక్కరే ప్రమాణం చేస్తారా? లేక ఆయనతో పాటు కొందరు మంత్రులెవరైనా ప్రమాణం చేస్తారా? అనేది తేలాల్సి ఉన్నది. అటు, మంగళవారం రాత్రి ఢిల్లీకి వెళ్లిన రేవంత్‌రెడ్డి.. తన మంత్రివర్గంలో ఎవరెవరికి అవకాశం ఇవ్వాలనే అంశంపై అధిష్ఠానంతో చర్చలు జరిపినట్టు తెలిసింది. తన జాబితాను పార్టీ పెద్దలకు అందించగా, వారు కూడా ఓ జాబితాను రేవంత్‌కు అందించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఉమ్మడిగా చర్చించి మంత్రివర్గ జాబితాను రూపొందిస్తున్నట్టు తెలిసింది. అయితే బుధవారం అర్ధరాత్రి వరకు జాబితా ఖరారు కాలేదు. ఈ నేపథ్యంలో మంత్రివర్గం జాబితా ఖరారవుతుందా? వాయిదా వేస్తారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ జాబితా ఖరారైతే అధిష్ఠానమే నేరుగా మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న వారికి ఫోన్ చేసి సమాచారం ఇవ్వనున్నట్టు సమాచారం.

ఎయిర్‌పోర్ట్ నుంచి వెనక్కి రేవంత్‌రెడ్డి

బుధవారం హైదరాబాద్‌కు బయల్దేరిన రేవంత్‌రెడ్డిని పార్టీ పెద్దలు ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి తిరిగి రప్పించుకున్నారు. రేవంత్‌రెడ్డి హఠాత్తుగా వెనుదిరగటం చర్చనీయాంశంగా మ